క్లుప్తంగా

సేవలకు గుర్తింపు



పురస్కారాన్ని అందుకుంటున్న రెడ్‌క్రాస్ ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ద్వారా 2022–23 సంవత్సరంలో అందించిన సేవలకు గుర్తింపు లభించింది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా పురస్కారాన్ని రెడ్‌క్రాస్ జిల్లా ట్రెజరర్ కనుగులు దుర్గాశ్రీనివాస్ అందుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని దూసిపేటకు చెందిన పైడి పద్మావతి కుటుంబానికి హాయ్ ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని సంఘం సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.20 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. ఇన్ఫెక్షన్ కారణంగా ఆమె కుడికాలు తొలగించడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. దీంతో తమవంతుగా సాయం అందించడం జరిగిందని సంఘం సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో సీపాన శ్రీను, కింతాడ సంతోష్, ఎస్.కేశవ్, బి.శ్రీను, పి.నాగరాజు, ఎస్.శ్రీను, పి.కిషోర్, దాడ సంతోష్, కె.పురుషోత్తమ్, దాసరి కిరణ్, అత్తిలి సతీష్, కాకర్ల నర్సింగ్, కె.హేమంత్, పి.గోవింద్, బి.చిన్నారావు, పి.అనంతరావు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్ ప్రతీ మహిళలకు ఓ శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యాప్ డౌన్‌లోడ్ చేయడంతో పాటు ఉపయోగాలను వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



గ్రామంలో పరిశీలిస్తున్న భారతీ సౌజన్య

ఎచ్చెర్ల: మండలంలోని ఫరీదుపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా జ్వరాలు ప్రబలడంతో జిల్లా పంచాయతీ అధికారి భారతీసౌజన్య గ్రామాన్ని బుధవారం సందర్శించారు. గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఆమెతో పాటు ఎంపీడీవో సీపాన హరిహరరావు, ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యురాలు ఉషశ్రీ, పంచాయతీ కార్యదర్శి కేశవరావు, ఏఎన్‌ఎం రజియ తదితరులు పాల్గొన్నారు.

టీజీఐ ఇసుక నిల్వల పరిశీలన



టీజీఐ పరిశ్రమలో పర్యటిస్తున్న అధికారుల బృందం

గార: మండలంలోని సతివాడ ట్రాన్స్ వరల్డ్ గార్నెట్ పరిశ్రమ ఇసుక నిల్వలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. పరిశ్రమ మూతబడిన సమయంలో 40 వేల టన్నుల ఇసుక ఉండేదని, తర్వాత కొంతమేర ఇసుక దొంగలపాలవ్వడంతో వాటిపై దర్యాప్తు చేపట్టాలని యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విజయవాడ నుంచి వచ్చిన ఉన్నతాధికారులుతో పాటు మైన్సు డీడీ మోహనరావు, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పరిశీలించారు. నిల్వలపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో లెక్కింపు చేయలేమని, వీటిని తొలగించిన తర్వాత లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

మెగా జాబ్‌మేళా రేపు

ఎచ్చెర్ల: మండలంలో చిలకపాలేం గ్రామంలోని గణేష్ ఐటీఐ కళాశాలలో ఈనెల 11వ తేదీన మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల హెచ్‌ఎం పి.గజపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ఐటీసీ లిమిటెడ్, ఇసుజ, హుందాయ్, గ్లోవిస్, మొబిస్, ఇండెమిమ్, ఇండర్ కాపీ ప్రైవేటు లిమిటెడ్, ఇన్‌ప్లీమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, డిక్సన్‌తో పాటు మరికొన్ని పరిశ్రమలు హాజరవుతున్నాయని చెప్పారు. జిల్లాలో ఆసక్తి ఉన్నటువంటి ఐటీఐ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల పంజా..!

- నగరంలో పారిశుద్ధ్య లోపం
- పెరుగుతున్న దోమల బెడద
- పట్టించుకోని అధికారులు





నగరంలో పేరుకుపోయిన చెత్త

శ్రీకాకుళం: నగరంలో పెరుగుతున్న దోమలు ప్రజల ఆరోగ్యంపై పంజా విసురుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాటు పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రంగానే నిర్వహిస్తుండడంతో దోమల బెడద ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కాలువల్లోని పూడికలు ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పాటు చెత్తను సమయానికి తరలించకపోవడంతో ఇబ్బందులు ఎదు రవుతున్నాయి. గతంలో చెత్తను తొలగించిన తర్వాత డస్ట్ బిన్లను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అలాగే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేసేవారు. దీనివలన లార్వా చనిపోయి దోమల బెడద కొంత తగ్గుముఖం పట్టేది. అలాగే దోమల లార్వాను తినే గాంబూసియా చేపలను కాలువల్లో వదిలిపెట్టేవారు. ఈ చేపలు లార్వాను తినడం వలన దోమలు కాస్త తగ్గేవి. అలాగే నగరమంతా ఫాగింగ్ చేసేవారు, ఈ



ఖాళీ స్థలంలో పేరుకుపోయిన బురద

పొగ వల్ల కూడా దోమలు తగ్గుముఖం పట్టేవి. కానీ ప్రస్తుతం ఇవేమీ కనిపించకపోవడంతో నగర ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

నగరంలోని ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అయినప్పటికీ ఈ విషయంపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టడం లేదు. మున్సిపాలిటీగా ఉన్న శ్రీకాకుళానికి నగరపాలక సంస్థ స్థాయి వచ్చినప్పటికీ అందుకు తగ్గట్టుగా నగర ప్రజలకు సౌకర్యాలు మాత్రం అందడం లేదు. పన్నులు మాత్రం నగర స్థాయిలోనే వసూలు చేస్తున్నారు. అలాగే సిబ్బంది లేకపోవడం కూడా చర్యలు తీసుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. వర్షాకాలంలో దోమల వలన మలేరియా, ఫైలేరియా. డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ఇవేవీ నగరపాలక సంస్థ అధికారులకు పట్టడం లేదు. ఇదే విధానం కొనసాగితే నగర ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందువలన ఇప్పటికైనా నగరపాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేటట్లు చూడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడం వంటివి చేస్తున్నాం. ఇటీవల బదిలీల ప్రక్రియ జరుగుతూ ఉండడంతో పారిశుద్ధ్యంపై కొంత మేర దృష్టి సారించలేకపోయాం. ఒకటి రెండు రోజుల్లో ఫాగింగ్ కూడా చేయిస్తాం. ఖాళీ స్థలాల యజమానులకు శుభ్రం చేయించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

– డాక్టర్ సుధీర్ బాబు,
ఆరోగ్యశాఖ అధికారి, నగరపాలక సంస్థ

నేడు గురు పూర్ణిమ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలుచోట్ల గురు పూర్ణిమ వేడుకలు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విశాఖ–బీ కాలనీలోని షిరిడి సాయి మందిరంలో గురు పూర్ణిమ పురస్కరించుకొని సామూహిక అఖండ గురు చరిత్ర పారాయణ, మహాభోగ నివేదన, నారాయణ సేవా సమితిచే అన్నప్రసాద వితరణ జరుగుతుందని మందిరం కన్వీనర్ తెలిపారు. అలాగే మొండేటివీధిలోని షిరిడిసాయి మందిరంలో సాయినాథునికి అభిషేకాలు, అర్చనలు లలితాదేవికి అభిషేకాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరీ దేవీ పీఠంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో గురుపూజోత్సవంలో భాగంగా మేధాదక్షిణామూర్తికి స్తోత్రం, లలితా పారాయణ, సుసరాపు చంద్రశేఖర అవధానికి వ్యాస పురస్కారంతో సత్కారం జరుగుతాయని తెలిపారు. వాడాడకు చెందిన తరిణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురు సత్కారంలో భాగంగా రాజరాజేశ్వరీ సంగీత విద్యా పీఠం వ్యవస్థాపకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మకు సత్కారం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు మండా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్‌ఏయూలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ రజనీ

ఎచ్చెర్ల: స్విచ్చింగ్ థియరీ అండ్ లాజిక్ డిజైన్ అంశంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ రాజశేఖర్ రాసిన పాఠ్యాంశ సంబంధిత పుస్తకాన్ని బుధవారం వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజనీ ఆవిష్కరించారు. ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఉపయోగపడే ఈ పుస్తక రచనలో లాజిక్ డిజైన్ గురించి విపులంగా వివరించారు. అనంతరం రచయిత డా.రాజశేఖరరావును ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు, నూతన ఆవిష్కరణలు, విద్యార్థులకు ఉపయోగపడే రచనలపై దృష్టి సారించాలని సూచించారు.

విలీన ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతికి సమస్య తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గార: తమ పాఠశాల నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులను ఇంకో పాఠశాలలో విలీనం చేసే ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కె.మత్స్యలేశం యూపీ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు. బుధవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సన్నద్ధంలో భాగంగా పాఠశాలకు విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీవో పద్మావతిని కలిసి సమస్యలను తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలను ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ఈ పరిస్థితుల్లో కొన్ని తరగతులను తొలగించవద్దని కోరారు. దూరంగా ఉన్న హైస్కూల్‌కు వెళ్లడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, మెగా పేరెంట్ మీట్‌లో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంఈవో ఎస్.రామకృష్ణ, బి.ఎర్రన్న, హెచ్‌ఎం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



ఫిర్యాదు కాపీ

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం పాతబస్టాండు: నగరంలోని బొంతా వారివీధిలో ఉన్న కృష్ణార్జున మందిరానికి దాతలు ఇచ్చిన స్థలం ఆక్రమణలకు గురైందని గీతా ప్రచార సమాజం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులను ప్రశ్నిస్తే దుర్భాషలాడుతున్నారని పేర్కొన్నారు. ఇదివరకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. ఫిర్యాదు చేసినవారిలో గీతా ప్రచార సమాజం ప్రతినిధులు ఎ.రామారావు, ఎ.వెంకటరావు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

శ్రీకాకుళం రూరల్/అరసవల్లి: మండల పరిధిలోని ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ఎస్‌ఎస్‌వలస, బైరివానిపేట, నక్కపేట, ఎఫ్‌సీఐ గోదాం, సిమ్మపేట, బట్నపేట, కంచుభూమయ్యపేట, కిష్టప్పపేట, బగ్గువానిపేట, మామిడివలస, అంపోలు రోడ్, ఆడవరం తదితర గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం ఎస్‌ఎస్ పరిధిలో డి.మత్స్యలేశం ఫీడర్‌లో ఉన్న డి.మత్స్యలేశం, రాళ్లపేట, కె.మత్స్యలేశం, భగీరథపురం, గిన్నివానిపేట, మూసవానిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే బడివానిపేట ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొయ్యాం, బడివానిపేట, జాలారికొయ్యాం, కేకే నాయుడుపేట, నిమ్మవానిపేట, పీకే నాయుడుపేట, అజ్జరాం, కుప్పిలి ఏజీఎల్, వైశాఖి బయోమెరైన్ పరిశ్రమ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాల నిలిపివేయడం జరుగుతుందని ఈఈ పి.యేగీశ్వరావు తెలియజేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

రణస్థలం: మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం హెచ్చరించారు. మండలంలోని వెల్పురాయి గ్రామంలో జేఆర్‌పురం పోలీసులు నారీ శక్తి కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అండగా ఎన్నో చట్టాలు ఉన్నాయని, ఎవరైనా ఇబ్బంది పెడితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.చిరంజీవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరణ



రోడ్డుపై మురుగు నీటిని చూపుతున్న మహిళ

గార: ఎంపిక చేసిన పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా జరగాలని జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా సూచించారు. బుధవారం ఉదయం తూలుగులో జరుగుతున్న చెత్త సేకరణపై ప్రజలతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అప్పగించడంపై ఏమైనా సమస్యలున్నాయా అని ప్రశ్నించారు. కాలువ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ఉండిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళ ఫిర్యాదు చేసింది. రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో ఎనిమిది పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోందని ఎంపీడీవో రఘు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కూర్మారావు, సెక్రటరీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న జేఏసీ ప్రతినిధులు

అరసవల్లి:

విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, కార్మికుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం పనితీరు ప్రదర్శించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నిరసన చేపట్టింది. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మెలో భాగంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం భోజన విరామం సమయంలో స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నిబంధనల మేరకు పెన్షన్ ట్రస్ట్‌లో నిధులు జమ చేసి ట్రస్టులను బలోపేతం చేయాలని, అలాగే క్షేత్రస్థాయిలో ఖాళీల పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే విద్యుత్ చట్టసవరణ బిల్లులను వెంటనే ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ మహంతి ప్రభాకరరావు, ముఖ్య నేతలు ఎన్.లోకేశ్వరరావు, ఆర్.రాజేశ్వరరావు, బీవీ గురునాథరావు, పి.ఈశ్వరరావు, సురేష్‌కుమార్, టీవీ సుబ్రహ్మణ్యం, బి.జీవరత్నం, జి.రాజారావు, సీహెచ్ పాపారావు, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డీఎల్‌డీవో అరుంధతి దేవి

జి.సిగడాం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని డివిజనల్ అభివృద్ధి అధికారి అరుంధతి దేవి సూచించారు. మండలంలోని వెలగాడ గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మురికి కాలువలో చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. వాతావరణ మార్పులు వల్లన అంటురోగాలు వచ్చే అవకాశం ఉందని, వీటిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు చేబ్రోలు సురేష్, తులసీప్రసాద్‌సాహు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ర్యాలీగా వెళ్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని వక్తలు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా వ్యాప్తంగా తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ కార్మికులంతా కదం తొక్కారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని నినాదాలు చేశారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరించడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గార: మండల కేంద్రంలో ర్యాలీ చేపడుతున్న కార్మిక సంఘాల సభ్యులు



ఎచ్చెర్ల: బైక్ ర్యాలీ చేపడుతున్న సీఐటీయూ నాయకులు



శ్రీకాకుళం అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు



రణస్థలం: ర్యాలీ చేపడుతున్న కార్మికులు



శ్రీకాకుళం అర్బన్: ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్న ఉద్యోగులు, సిబ్బంది



జి.సిగడాం: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బ్యాడ్మింటన్ టోర్నీ విజయవంతం చేయాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈనెల 12, 13 తేదీల్లో జరగనున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను విజయంతం చేయాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణశెట్టి వెంకట కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం సాయంత్రం ఆ సంఘ బాధ్యులతో కలిసి టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడకు గణనీయంగా ఆదరణ పెరిగిందన్నారు. గతంతో పోలిస్తే మూడు, నాలుగేళ్లుగా ఎంట్రీలు విస్తృతంగా పెరిగాయన్నారు.

టోర్నీకి ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

జేఎస్‌వీ జ్యూయలర్స్ టైటిల్ స్పాన్సర్‌గా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బాడ్మింటన్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా భావించి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌వీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మొత్తం ఆరు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అండర్–11, అండర్–13, అండర్–15, అండర్–17, అండర్–19 బాల బాలికలకు, అలాగే స్త్రీ, పురుషులు(సీనియర్స్) వయో విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇక్కడ రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు పంపించనున్నట్లు బాడ్మింటన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్ కుమార్, గురుగుబెల్లి ప్రసాద్ వెల్లడించారు. టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పించేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 94402 55255, 83285 14385 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జిల్లా సీఈవో సంపతిరావు సూరిబాబు, మెండ శాంతికుమార్, ఎంఈ రత్నాజీ, మనోహర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరని హ్యాండ్‌బుక్‌లు



సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో పడి ఉన్న టీచర్ హ్యాండ్‌బుక్స్

శ్రీకాకుళం: జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు విద్యార్థుల పట్లే కాకుండా ఉపాధ్యాయుల విషయంలోనూ నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా టీచర్స్ హ్యాండ్ బుక్‌ను పేర్కొనవచ్చు. ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా ఈ హ్యాండ్‌బుక్‌ను అందజేస్తారు. అందులో నెలవారీ సిలబస్‌తో పాటు బోధన నమూనా (లెసన్ ప్లాన్) తదితర వివరాలు పొందుపరుస్తారు. ఈ పుస్తకం ఆధారంగానే ఏ నెలలో ఏయే పాఠాలు బోధించాలి?బోధనకు ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో ఉపాధ్యాయులు నిర్ణయించుకుంటారు. ఇంతటి విలువైన పుస్తకాలు పాఠశాల పునఃప్రారంభం నాటికే జిల్లాకు చేరుకున్నప్పటికీ, మండలానికి చేరవేయటంలో సమగ్ర శిక్ష అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అవన్నీ ఎస్‌ఎస్‌ఏ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు పుస్తకాలను రవాణా చేసే బాధ్యతలు తీసుకున్న వ్యక్తులతో కొందరికీ తేడాలు రావడంతో వాటిని మండల స్థాయికి పంపించకుండా ఉంచేసినట్టు సమగ్ర శిక్ష కార్యాలయంలోని కొందరు ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఈ పుస్తకాలు అందకపోగా జూన్‌లో యోగాంధ్ర పేరిట, తాజాగా మెగా పేరెంట్స్ డే పేరిట ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయటంలో సిలబస్ పూర్తికాలేదు. ఆగస్టు 4 నుంచి సమ్మెటివ్–1 నిర్వహించనుండగా అప్పటికి విద్యార్థులను సన్నద్ధం చేయడం కష్టమేనని ఉపాధ్యాయులే చెబుతున్నారు. ఎస్‌ఎస్‌ఏ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ అయినా దృష్టి సారించి టీచర్స్ హ్యాండ్‌బుక్‌ను త్వరితగతిన ఉపాధ్యాయులకు అందించాలని పలువురు కోరుతున్నారు.